Assembles Of The Living Elohim (1. Tim 3:15) India presents............ సత్యసంబంధియైన ప్రతివాడును నా మాట వినుననెను. యోహాను 18:38

Satyamunakai Poratam REGD. No. 67970 / 97

# సత్యమునకై పోరాటం

Regd. Monthly Newspaper 67970/97
**Postal Regd. No. H/APM/01/2011-2014**
Valid upto 12/2014
Posted on 30th of Every Month
**Annual Subscription Rs. 100/-**

To :

Editor & Publisher:
Bro. Isaac E. Kusuma,
MALIKIPURAM-533253
E.G.Dist., A.P., India

Founder & President:
Marriage Registrar
A.O.T.L.E-India
www.aotle-india.org

E-mail: satyamunakaiporatam@gmai.com
E-mail: isaacekusuma@gmail.com
Phone : 98493 85038
Free phone: 92989 03470

**VOLUME : 14** **SHEBAT-ADAR 5773 (Jan-Feb 2013)** **PAGES:4** **ISSUE 173,174**

హెచ్చరిక:- ఈ పత్రిక ఖండితముగా సత్యాన్వేషుల కొరకు మాత్రమే గాని క్రైస్తవ మతశాఖల వారి కొరకు కాదు

# ఎలోహీం ఒక్కడే

- ఇశ్రాయేలూ వినుము. మన ఎలోహీమైన యావె అద్వితీయుడగు యావె.............. ద్వితీ 6:1
- ఆదియందు ఎలోహీం భూమ్యాకాశములను సృజించెను................................ ఆది 1:1
- ఆదియందు వాక్యము ఉండెను.......................................................... యోహాను 1:1

పరిశుద్ధ గ్రంథమంతా ఎలోహీం ఒక్కడే అని చెప్తుంది.

- నాకు ముందుగా ఏ ఎలోహీంను నిర్మింపబడలేదు నా తరువాత ఏ ఎలోహీం నుండడు. నేను నేనే యావెను, నేను తప్ప వేరొక రక్షకుడును లేడు. ప్రకటించినవాడను నేనే రక్షించినవాడను నేనే దాని గ్రహింపజేసిన వాడను నేనే. యెషయా 43:10-12

ఎలోహీం **ఒక్కడే** అని అనేక బైబిలు వాక్యములు మనకు ఋజువుచేయుచున్నవి. ఎఫెస్సీ 4:6, 1తిమోతి 2:5, యాకోబు 2:19, 1కొరింథీ 8:6, గలతీ 3:20, రోమా 3:30

- ఆయన **ఒక్కడే** ఆకాశమండలమును విశాలపరచువాడు యోబు 9:8 (ఆది 1:6, కీర్తనలు 104:2,3)
- యావెనగు **నేనే** సమస్తమును సమస్తమును జరిగించువాడను **నేనొకడనే** ఆకాశమును విశాలపరచినవాడను. **నేనే** భూమిని పరచినవాడను **నేనే** ప్రగల్భుల ప్రవచనములను వ్యర్థము చేయువాడను.....**నేనే** నా సేవకుని మాటను రూఢిపరచువాడను....యెషయా 44:24-26
- భూమిని కలుగజేసినవాడను **నేనే** దాని మీదనున్న నరులను **నేనే** సృజించితిని. **నా** చేతులు ఆకాశములను విశాలపరచెను. యెషయా 45:12 (ఆది 1:26,27)
- ఆకాశమందైనను భూమిమీదనైనను దేవతలనబడినవి యున్నను మనకు ఒక్కడే ఎలోహీం ఉన్నాడు. ఆయన తండ్రి. ఆయన నుండి సమస్తమును కలిగెను..1కొరింథీ 8:6
- అధిక బలముచేతను చాచిన బాహువుచేతను భూమిని భూమి మీదనున్న నరులను జంతువులను **నేనే** సృజించి ఎవరికిచ్చుట న్యాయమని నాకు తోచునో వారికే యిచ్చుచున్నాను....యిర్మీయా 27:5
- భూమ్యాకాశములను సృజించిన యావె చేత మీరు ఆశీర్వదింపబడినవారు ఆకాశములు యావె వశము భూమిని ఆయన నరులకు ఇచ్చియున్నాడు. కీర్తనలు 115:15,16
- ఆకాశమండలమును విశాలపరచి భూమికి పునాదివేసి మనుష్యుల అంతరంగములో జీవాత్మను సృజించు యావె సెలవిచ్చునదేమనగా.....జెకర్యా 12:1
- అ॥కార్య 17:26,27 కూడా చదవండి.
- నిర్గమ 20:11 ఆరు దినములలో యావె ఆకాశమును భూమియు సముద్రమును వాటిలోని సమస్తమును సృజించి, యేడవ దినమున విశ్రమించెను.

ఈ వాక్యభాగములన్నీ పరమతండ్రియైన యావె ద్వారా జరిగినట్లు ఋజువు అవ్వుచున్నది. ఆయన **ఒక్కడే** వీటన్నిటనీ చేసెనని చెప్పుచుండగా, ఇద్దరు దేవుళ్ళని, ముగ్గురు దేవుళ్ళనే గోల ఎక్కడనుండి వచ్చింది?

**1. ఆది 1:1** ఎలోహీం అంటే సర్వశక్తిమంతుడైన దేవుడని అర్థం. ఆ పదం హెబ్రీపదమైనప్పటికీ అది ఒక్క పరమతండ్రికేగాని మరి ఎవనికినీ ఉపయోగించబడవలసినది కాదు.

**2. ఆది 1:26** మన స్వరూపమందు మన పోలికె చొప్పున అనిఉంది గనుక ఎక్కువమంది ఉన్నారని ఊహించుట చాలా తప్పయి ఉన్నది. పరమతండ్రియైన యావె ఒక్కడే అయనా ఆయన కుడి పార్శ్వమున ఎడమ పార్శ్వమున పరలోక సైన్యసమూహాము ఉంది. దానిని బట్టే మన, మనపోలిక అనెడి మాటలు ఉపయోగించబడినవి. చూడండి పరలోక సైన్య సమూహాము 1రాజులు 22:19,20 : యావె సింహాసనాసీనుడై యుండగా పరలోక సైన్యమంతయు ఆయన కుడిపార్శ్వమునను ఎడమపార్శ్వమునను నిలిచియుండుట నేను చూచితిని. 2దిన 18:18 - యావె తన సింహాసనము మీద ఆసీనుడైయుండుటయు, పరమండల సైన్యమంతయు ఆయన కుడిప్రక్కను ఎడమప్రక్కను నిలువబడుటయు నేను చూచితిని. రాజైన ఉజ్జీయా మృతినొందిన సంవత్సరమున అత్యున్నతమైన సింహాసనమందు సర్వాధికారి ఆసీనుడైయుండగా నేను చూచితిని; ఆయన చొక్కాయి అంచులు యావె ఆలయమును నిండుకొనెను. ఆయనకు పైగా సెరాపులు (మహాదూతలు) నిలిచియుండిరి; ఒక్కొక్కరికి ఆరేసి రెక్కలుండెను. ప్రతివాడు రెండు రెక్కలతో తన ముఖమును రెంటితో తన కాళ్ళను కప్పుకొనుచు రెంటితో ఎగురుచుండెను. వారు సైన్యములకధిపతియగు యావె, పరిశుద్ధుడు పరిశుద్ధుడు పరిశుద్ధుడు; సర్వలోకము ఆయన మహిమతో నిండియున్నది అని గొప్ప స్వరముతో గాన ప్రతిగానములు చేయుచుండిరి. వారి కంఠస్వరము వలన గడప కమ్ముల పునాదులు కదలుచు మందిరము ధూమము చేత నిండగా........యెషయా 6:1-4 ఇంక సింహాసనములను వేయుట చూచితిని; మహావృద్ధుడొకడు కూర్చుండెను. ఆయన వస్త్రము హిమమువలె ధవళముగాను, ఆయన తలవెండ్రుకలు శుద్ధమైన గొఱ్ఱెబొచ్చువలె తెల్లగాను ఉండెను.ఆయన సింహాసనము అగ్నిజ్వాలలవలె మండుచుండెను; దాని చక్రములు అగ్నివలె ఉండెను. అగ్నివంటి ప్రవాహము ఆయనయొద్దనుండి ప్రవహించుచుండెను. వేవేలకొలది ఆయనకు పరిచారకులుండిరి; కోట్లకొలది మనుష్యులు ఆయన యెదుట నిలిచిరి, తీర్పుతీర్చుటకై గ్రంథములు తెరువబడెను. దానియేలు 7:9,10 పరమతండ్రియైన యావె చుట్టు పరలోకసైన్యసమూహాము ఉంది. వాటిని గూర్చి చెపుతూనే మన, మనపోలిక మొ॥గు మాటలు వ్రాయబడినవి. అని మనం గుర్తించవలసియున్నది.

**3. ఆది 3:22.** ఆదాము మనలో ఒకని వంటి వాడాయెను ఈ వాక్యం కూడా అంతే పరమతండ్రియైన యావెకు, యావె దూతలకు మంచి-చెడ్డలు ఎలా తెలుసో అటులనే ఆదాముకి-అవ్వకు పండుతినిన తర్వాత మంచ చెడ్డలను ఎరిగారు. వారి ద్వారా సమస్త మానవులకు మంచి చెడ్డలు తెలిసినవి. (రోమా 2:14)

**4. ఆది 11:7** "మనము దిగిపోయి" అనే ఈ మాట కూడా దేవదూతలను ఉద్దేశించే చెప్పబడినది. కాని మీరు 11:1-9 వరకూ చక్కగా చదివితే యావె ఒక్కడే వారిని చెదరగొట్టినట్లు కనపడుతుంది. 11:5,8,9. యావె దిగివచ్చి వారిని చెదరగొట్టినట్లు మనం చూడగలము.

**5. ఆది 18:1-2** ఇక్కడ పరమతండ్రియైన యావె+ఇద్దరు యావెదూతలు అబ్రాహామునకు కనపడిరి.అబ్రాహాము ముగ్గురిలో ఒక్కరైన యావెను చూచి ప్రభువా అంటున్నాడు (18:3). ముగ్గురు వేరు వేరు వ్యక్తులైనప్పుడు ప్రభువులారా! అని అనాలి గదా! ప్రభువా అనే మాట 5సార్లు చూడగలం. అదే ఇద్దరు యావె దూతలు లోతు ఇంటికి సొదొమ వెళ్ళినప్పుడు లోతు వారిని చూసి ప్రభువులారా (19:2) అని పిలుస్తున్నాడు.

**6. యెషయా 6:8** అప్పుడు-నేను ఎవని పంపెదను? మా నిమిత్తము ఎవడు పోవునని ప్రభువు సెలవియ్యగా వింటిని. ఇక్కడ "మా నిమిత్తము"అనగానే అనేకమంది అని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి అక్కడ పరమతండ్రియైన యావె+ఆయన దూతలు ఉన్నారు. ఇంత విపులంగా చక్కగా ఉన్నా "మా నిమిత్తం" అనేమాట మనకు అర్థం కావడంలేదా?

బైబిలు ప్రకారంగా పరమతండ్రి ఒక్కడే. ప్రభువు అనబడినవాడు, దేవుడు అనబడినవాడు, అన్నీ యావెయే. ఆయన మానవుడ్ని సృష్టించిన దినమునుండి పరలోకమునకు ఎక్కుచూ దిగుచూనే ఉన్నాడు. అనేకమైనసార్లు పరలోకం నుండి క్రిందికి దిగివచ్చాడు.

- ఆదాము అవ్వలను సృజించినప్పుడు వచ్చాడు
- ఆదాము అవ్వలను చల్లనిపూట కలుసుకునేవాడు
- కయీను హేబేలును చంపినప్పుడు వచ్చాడు
- ఆదాము అవ్వలు పాపము చేసినప్పుడు వచ్చాడు
- బాబెలు గోపురం చూడ దిగివచ్చాడు.
- సొదొమ గొమొఱ్ఱా మొఱ్ఱ విని దిగివచ్చాడు
- అలా అనేకమైన సార్లు దిగి వచ్చి వెళ్తూ ఉండేవాడు.

అదే విషయాన్ని యావె శరీరం ధరించి యషువ గా వచ్చినప్పుడు ఆయన చెప్తున్న మాట :పరలోకమునకు ఎక్కిన వాడెవడు? పరలోకమునుండ దిగిన వాడెవడు మనుష్యకుమారుడు తప్ప అని యోహాను సువార్తలో అంటున్నాడు. సామెతలు 30:4, యోహాను 3:13

యషువ అంటే యావె రక్షకుడని అర్థం. అంతేకాదు ఆయన ఇమ్మానుయేల్ అనగా ఎలోహీం మనకు తోడని అర్థం. ఆయన ఎలోహీం కుమారుడు కాడు.ఆయనకు రెండువందలకు పైగా బిరుదులు ఉన్నాయి. కాని పేరు మాత్రం ఒక్కటే

## యషువ = యావె రక్షకుడు.

ఈ యావెకే బాప్తీస్మమిచ్చు యోహాను దారి సరాళం చేస్తున్నాడు. యెషయా 40:3, అదే మత్తయి 3:3లో చెప్పబడినది. దేవుడు శరీరం ధరించి భూమిమీదికి వచ్చిన సన్నివేశం ఇది.

- నిరాక్షేపముగా యావె భక్తిని గూర్చిన మర్మము గొప్పదైయున్నది. ఆయన (పరమతండ్రి) సశరీరుడుగా ప్రత్యక్షుడయ్యెను. ఆత్మవలన నీతిమంతుడని తీర్పునొందెను. యావె దూతలకు కనబడెను. రక్షకుడని జనములలో ప్రకటింపబడెను లోకమందు నమ్మబడెను ఆరోహణుడై తేజోమయుడయ్యెను. 1తిమోతి 3:16

## ఆదియందున్న ఎలోహీం+ఆదియందున్న వాక్యముఇద్దరు కాదు ఒక్కరే.

ఆయనే శరీరధారిగా మనమధ్య నివసించెను. యోహాను 1:14. పరమతండ్రియైన యావె మెల్కిసెదెకుగా అబ్రహాము నొద్దకు వచ్చినట్లే యావె శరీరధారిగా మన మధ్యకు వచ్చెను.

- మరణశాసనము వ్రాసిన యావె మరణము అయ్యితేనే గాని ఆ శాసనము చెల్లదు గనుక రక్తమాంసములో పాలివాడై దాసుని రూపము దాల్చి మన మధ్య సంచరించెను. హెబ్రీ 9:16,17, 2:15-17, ఫిలిప్పీ 2:6-11. పరమతండ్రియైన యావె యషువ అను శరీరమును అమర్చుకొని (హెబ్రీ 10:5) తాను చేయవలసిన అనేక కార్యములు సంపూర్తిచేసాడు. గొఱ్ఱెపిల్ల-ప్రధానయాజకుడు కూడా ఆయనే. పరిశుద్ధుడు పాపశరీరాకారముతో పరిహారం చేసిన వాడు ఆయనే. అందుకే యావె భక్తిని గూర్చిన మర్మము బహుగొప్పది అన్నాడు 1తిమోతి 3:16. చాలామందికి యషువ మెస్సీయ మాటలు అర్థంకాక రకరకాలుగా పెడార్థాలు తీసిన సంఘటనలు కూడా లేకపోలేదు. ఆఖరికి తన కూడా తిరిగిన శిష్యులకే ఆయన అర్థం కాలేదు. ఆయన మాటలు అనేకులకు అర్థం కాలేదు. అయినను మనుష్యులు రకరకాలుగా ఊహించుకున్నారు. రకరకాలుగా ఆయన వారికి అర్థం అయ్యాడు.

యూదులైన అపోస్తలులకు తెలుసు. ఆయన శరీరం ధరించిన యావె అని. యూదులు ప్రభువా! అని ఒక్క యావెను మాత్రమే పిలుస్తారు. అందుకే 1కొరంథీ 12:3లో అపోస్తలుడైన సౌలు యిలా వ్రాస్తున్నాడు. "ఎలోహీం ఆత్మవలన మాటలాడువాడెవడును యషువ శాపగ్రస్తుడని చెప్పడనియు, పరిశుద్ధాత్మవలన తప్ప ఎవడును యషువను ప్రభువని (యావె అని) చెప్పలేడనియు నేను మీకు తెలియజేయుచున్నాను చూడండి. అ॥కార్య 9:1 సౌలు ఇంకను ప్రభువు యొక్క శిష్యులను బెదిరించుటయు హత్యచేయుటయును చేయుచుండగా, దమస్కురోడ్డులో ఆయన ద్వారా నేలను పడినప్పుడు ప్రభువా! నీవెవడవు అంటున్నాడు. ప్రభువు అంటే యావె. యూదులకు ఎంతమంది ప్రభువులు ఉన్నారని సౌలు వ్రాసాడు? ప్రభువు ఒక్కడే (ఎఫెస్సీ 4:4) ఆయననే ఈయన కనుగొని తన మార్గమును మార్చుకున్నాడు. ప్రభువు ఒక్కడే అని (1కొరింథీ 8:6)లో కూడా చెప్తున్నాడు. ఒక్కడే దేవుడు అని సౌలు బోధించాడు. మొదటి శతాబ్దంలోని అపోస్తలులంతా ఒక్కడే దేవుడని బోధించారు. యషువ మెస్సీయను శరీరం ధరించిన దేవుడని గ్రహించినవారు చాలా తక్కువమంది. యషువ మెస్సీయను దేవుని కుమారునిగా గాని, మనుష్యకుమారునిగా గాని, మెస్సీయగా గాని, ప్రవక్తగా గాని, చాలా సులభంగా నమ్మవచ్చుగాని యషువ మెస్సీయను శరీరం ధరించిన యావె గా నమ్మడం అనేది కేవలం ఆయన పరిశుద్ధాత్మ మరియు ఆయన ప్రత్యక్షత కలిగిన వారికే సాధ్యం. "మహిమ స్వరూపియగు

ప్రభువు" (1కొరంథీ 2:8) అనగా యషువ మెస్సీయ. యావె యొక్క సర్వపరిపూర్ణత యషువ మెస్సీయలో ఉందని (కొలస్సీ 2:9) సౌలు బోధిస్తున్నాడు. ఇది మర్మయుక్తమైన జ్ఞానం గనుక ఇది అందరకీ సంబంధించినది కాదు. పరమతండ్రి యొక్క జ్ఞానము మర్మముగా బోధించబడుతుంది (1కొరింథీ 2:7). అయినను పరలోక రాజ్యమర్మములు ఎరుగుట పరమతండ్రి సేవకులకే గాన అందరికీ నిర్ణయించబడలేదు. మత్తయి 13:11,12

పరమతండ్రియైన యావె శరీరం ధరించిన దగ్గరనుండి, జ్ఞానులు అజ్ఞానులుగా మారిపోయారు. దేవుడేమిటి మనిషిగా రావడం ఏమిటి? అనే సాతాను ప్రశ్న ద్వారా అనేకమంది భక్తిహీనులుగా మారిపోయారు. యషువ మెస్సీయ సర్వాంతర్యామి అనే ఆలోచన కూడా లేకుండా, దేవుడు పరలోకం వదిలి మనిషిగా భూమిమీదికి వస్తే పరలోకంలో ఎవరున్నారు? పరలోకం ఖాళీ అయ్యినట్లేగదా! అనే ఆలోచనలో ఎంత జ్ఞానం ఉందో ఒకసారి పరిశీలించండి. తండ్రీ అనే పదమును యషువ మెస్సీయ గూడార్ధముగా ఉపయోగిస్తే, (యోహాను 16:25,26) నిజంగానే ఆయనకు ఒక తండ్రి ఉన్నాడని, గనుకనే ఈయనను కుమారుడుగా నమ్మారు అనేకులు. అసలు తండ్రి కుమారుడు అనేది ఒక మర్మం. చదవండి ఈ వాక్యాలు (మత్తయి 11:27, లూకా 10:22, 1యోహాను 2:22)

- నీ తండ్రి యెక్కడ ఉన్నాడని యూదులు అడిగారు
- తండ్రిని మాకు చూపించు మాకంతే చాలు అని ఒక శిష్యుడు అడిగాడు. వాళ్ళకి ఆయన చూపించాడా? యోహాను 8:19+యోహాను 14:7-10 చూపించాడు. కాని అది అందరూ నమ్మలేదు గదా! మనుష్యులు అనుకున్నట్లుగా లేక మనుష్యులు ఊహించుకున్నట్లుగా పరమతండ్రి నడవవలసినది లేదు, రావలసినది లేదు. ఆయన నరులందరి సృష్టికర్త గనుక ఆయన ఏ విధంగానైనా భూమిమీదకు రాగలడు వెళ్ళగలడు. ఎలోహీం మనిషిగా రావడం ఏమిటి? అని అడిగేవాళ్ళను నేను ఒక ప్రశ్న అడగదలిచాను. అసలు ఎలోహీం మనుష్యులను ఎందుకు సృష్టించాలి? మనుష్యులతో ఈ పనులేమిటి? అని అడిగితే వీళ్ళ సమాధానమేమైయుంటుంది? నరులను ఎలోహీం భూమిమీద సృష్టించాడా? లేక పరలోకంలో సృష్టించి భూమిమీదకు తెచ్చిపెట్టాడా? అని అడిగితే దీనికి వీరి సమాధానమేమైయున్నది?

గనుక మానవ జ్ఞానముతో ఎలోహీం జ్ఞానమును శోధించుట అవివేకము. పరమతండ్రి తన స్వంత వ్రేలితో వ్రాసి యచ్చి పది ఆజ్ఞలలో : నేను తప్ప వేరొక ఎలోహీం నీకు ఉండకూడదు నిర్గమ 20:3, ద్వితీ 5:7, ఇక్కడ పరమతండ్రియైన యావె నేను తప్ప వేరొక ఎలోహీం నీకుండకూడదు అంటున్నాడు.

- ఇశ్రాయేలూ వినుము. మన ఎలోహీమైన యావె అద్వితీయుడగు యావె ద్వితీ 6:4, దీనిని ఇశ్రాయేలీయులు షమా అంటారు. పరమతండ్రి పాతనిబంధన కాలంలో కూడా పరమతండ్రి యైన యావె నరులను భూమిమీద చేసిన దగ్గరనుండి నేటివరకు అనేకసార్లు భూమి మీదికి దిగి వచ్చి వెళ్ళిన సంఘటనలు కలవు. అంతేగాని ఆకాశంలో ఒక దేవుడు, భూమిమీద ఇంకొక దేవుడు, వీళ్ళిద్దరికి మధ్య పావురం ఆకారంలో మూడో దేవుడు లేడు. అలా ఊహించడమే చాలా నీచమైన పని. "నేను తప్ప వేరొక ఎలోహీం లేడని ఆజ్ఞలలో చెప్పి, నా ముందు వేరొక ఎలోహీం లేడు, నా వెనుకను ఇంకొక ఎలోహీం ఉండడు" అని చెప్పిన యావె మాట అబద్ధమా? కానే కాదు. శబ్దములు, ఉరుములు, సూచనలు మొ॥నవి మనుష్యులకు నమ్మకం కలగడం కోసమే ఆయన చేసాడు. అంతేగాని ముగ్గురు ఉండి మూడు రకాలుగా చేస్తున్నారని కాదు.

**7. మత్తయి 3:16,17** ఈ వచనాల్లో ముగ్గురు దేవుళ్ళ సాక్ష్యం ఏమీ లేదు. ఈ శబ్దం కేవలం బాప్తీస్మమిచ్చు యోహాను యషువ మెస్సీయను గూర్చి రూఢి పరచుకొనుటకే వచ్చినది. చదవండి యోహాను సాక్ష్యం యోహాను 11:24-34. ముఖ్యంగా 31-34 వచనములు అది ఋజువుచేస్తున్నది. అదే విధముగా కొన్ని కొన్ని సంఘటనలు అనగా శబ్దములు, సూచకక్రియలు, స్వరములు, ఉరుములు నిర్ధారణ కొరకు మాత్రమే పంపబడినవి గాని ముగ్గురు దేవుళ్ళు కలిసి చేస్తున్న పనులు కావు.

**8. మత్తయి 17:1-8** సన్నివేశం కూడా అలాంటిదే: పేతురు యోహాను యాకోబులను మాత్రమే తీసుకొని వెళ్ళి పరమతండ్రియైన యషువ మెస్సీయ రూపాంతరం చెంది కొన్ని విషయములు ఆయన వారికి చూపించాడు. అక్కడ ఒక మేఘము వచ్చి, మేఘమునుండి ఒక శబ్దము పుట్టి ఒక స్వరము వినబడినది. దెబ్బతో వాళ్ళ ముగ్గురూ బోర్లబడ్డారు. వాళ్ళతో మాత్రమే ఆ స్వరం మాట్లాడింది. తీరా వాళ్ళు ఆ షాక్ నుండి తేరి చూసేసరికి "యషువ" తప్ప ఎవరూ కనబడలేదు. ఇదే విషయాన్ని కేఫాగారు (పేతురు) తన పత్రికలో వ్రాస్తూ, ఆకాశమునుండి వచ్చిన శబ్దము కన్నా స్థిరమైన ప్రవచన వాక్యము మనకున్నది అది చీకటి వెలుగిచ్చు దీపమైయున్నది దాని యందు మీరు లక్ష్యముంచాలి అని వ్రాసాడు. 2పేతురు 1:17-19. యోహాను 12:28-31 ఇక్కడ కూడా అలాంటి సన్నివేశమే ఒకటి ఉంది. దానిని గూర్చి కూడా యషువ మెస్సీయ మాట్లాడుతూ అది మీ కోసమే వచ్చింది అన్నాడు.

యషువ మెస్సీయ భూలోకంలో జీవించిన $33^{1/2}$ సం॥రాల జీవితం మీద సాతానుకి సరియైన గ్రిప్ లేదు. ఆయన పుట్టుకతోనే వాడికి కలవరం భయం ప్రారంభమైంది. "యూదుల రాజుగా పుట్టిన వానిని చూడవచ్చితిమని జ్ఞానులు హేరోదు రాజుతో అనగానే హేరోదు రాజు+యరూషలేము ప్రజలందరూ కలవరపడిరి." మత్తయి 2:1-16, అప్పటినుండే కలవరం-కలవరం-కలవరం బయలుదేరింది. అక్కడనుండే కుట్ర ఆలోచనలు ప్రారంభం అయ్యాయి. ఇది ఏ ప్రవక్త కాలంలోనూ జరగని సంఘటన. ఎందుకంటే ఆయన "యూదుల రాజు". యూదులకు రారాజు ఎవరు? యావె తప్ప :

యషువ మెస్సీయ :

- ప్రవక్తలకన్నా గొప్పవాడు
- సొలొమోను కన్నా గొప్పవాడు
- యావె ఆలయం కన్నా గొప్పవాడు
- దావీదే ఆయనను ప్రభువు అన్నాడు
- పురాతన కాలం నుండి ఉన్నవాడని మీకా ప్రవక్త చెప్పాడు
- యెషయా ప్రవక్త అయితే 9:16లో
    1. శిశువు పుట్టెను
    2. కుమారుడు అనుగ్రహింపబడెను
    3. భుజములమీద రాజ్యభారముండును
    4. ఆశ్చర్యకరుడు
    5. ఆలోచనకర్త
    6. బలవంతుడగు ఎలోహీం
    7. నిత్యుడగు తండ్రి
    8. సమాధానకర్తయగు అధిపతి అని చెప్పాడు

- యెషయా ఇమ్మానుయేల్ అని అన్నాడు. ఇమ్మానుయేల్ అనగా ఎలోహీం మనకు తోడని అర్థం అంతే గాని ఎలోహీం కుమారుడుతోడని కాదు లేక క్రైస్తవ్యాన్ని ప్రవేశపెట్టిన కేథలిక్స్ చెపుతున్నట్లు ఎలోహీం కుమారుడు కాడు. ప్రవక్తల బోధకు యషువ మెస్సీయ బోధకు చాలా వ్యత్యాసం ఉంది. ఈయన అధికారం గల వానివలె బోధించాడు. మత్తయి 7:29

ఈ వచనములు గమనించండి.

1. మత్తయి 5:21 - నేను మీతో చెప్పునదేమనగా
2. మత్తయి 5:27 - నేను మీతో చెప్పునదేమనగా
3. మత్తయి 5:33 - నేను మీతో చెప్పునదేమనగా
4. మత్తయి 5:38 - నేను మీతో చెప్పునదేమనగా
5. మత్తయి 5:43 - నేను మీతో చెప్పునదేమనగా

పూర్వము పూర్వీకులతో చెప్పబడిన మాటలు మీరు విన్నారు గదా! అని చెపుతూ "నేను మీతో చెప్పునదేమనగా అని అంటున్నాడంటే ఈయన ఎవరైతే అలా అనగలడు? ధర్మశాస్త్రంలో చెప్పిన దానిని తక్కువ చేసి ఈయన మాటను ఎక్కువగా ఎక్స్‌పోజ్ చేస్తున్నాడంటే ఈయన కేవలం ఒక ప్రవక్త అయితే లేక కేవలం ఒక సాధారణ మనిషి అయితే ఇలా చెప్పగలడా?

- తన ప్రసంగాలు వినిన ప్రజలలో కలవరం రేగలేదా? సందేహములు పుట్టలేదా? కలహాలకు కారణం అవ్వలేదా? ప్రజలు అభ్యంతరం పడలేదా? కొంతమంది నమ్మి, కొంతమంది అపహసించలేదా? మెస్సీయ మార్గమును గూర్చి అల్లరి జరగలేదా? అధికారులలో ఏమి చెయ్యాలో తోచని స్థితి కలుగలేదా? ఎవరు ఇతను? అనే ప్రశ్నార్థకం ప్రజలలో అధికారులలో బోధకులలో కలుగలేదా? ఈయన మాటలు అనేకములు అపార్థం చేయబడలేదా? ఆయన పుట్టినదగ్గరనుండి నేటివరకు యషువమెస్సీయ ఎవరికి అర్థం అయ్యాడు? యషువ మెస్సీయను ఎవరెవరు ఏమన్నారో మీరు క్షుణ్ణంగా తెల్సుకోవాలనుకుంటే : మత్తయి, మార్కు, లూకా, యోహాను, అ॥కార్యములు చదివి ఎవరెవరు ఎలా సంబోధించారో మీ అంతట మీరే వ్రాసుకోండి. అప్పుడు మీకు తెలుస్తుంది.

అ॥కార్య 20:28 ఎలోహీం తన స్వరక్తమిచ్చి సంపాదించిన సమాజమును కాయుటకు....

ఆత్మయైయున్న ఎలోహీంనకు రక్తము ఎలా వస్తుంది?రక్తము కావాలంటే ఆత్మ శరీరమును ధరింపవలసి యున్నది. అందువలననే ఆయన ఒక శరీరమును అమర్చుకొని (హెబ్రీ 10:5) శరీరానుసారముగా పుట్టి (ఫిలిప్పి 2:6-11) సశరీరుడుగా ప్రత్యక్షుడయ్యెను (1తిమోతి 3:16) రక్తమాంసములు ధరించిన తండ్రి, ఆయన పిల్లలు రక్తమాంసములు గలవారైనందున వారిని విడిపించుట విషయములో రక్తమాంసములో పాలివారయ్యెను. హెబ్రీ 2:14,15., అదే కుమారుడి పాత్ర $33^{1/2}$ సం॥లు ఈ పాత్రలో యషువ మెస్సీయ శరీరానుసారముగా మన మధ్యనే ఉన్నప్పటికీ ఆయన 100% ఎలోహీం. యషువ మెస్సీయ సర్వాంతర్యామి. ఆయన అన్ని ప్రదేశాలలోను ఉన్నవాడు. అందరి ఆంతర్యమును ఎరిగినవాడు. ఆయనకు అన్నీ తెలుసు. యోహాను 2:24,25

- సాతాను శోధిస్తున్నప్పుడు వాక్యము ద్వారా సాతానుకి బుద్ధిచెప్పి జయము పొందాడు మత్తయి 4:1-14, యావె దూతలు వచ్చి ఆయనకు పరిచర్య చేసారని వ్రాయించబడింది.
- శాస్త్రులు, పరిసయ్యులు సద్దూకయ్యుల హృదయాంతరంగములలోని ఆలోచనలను, కుయుక్తులను కనిపెట్టి మాట్లాడేవాడు.
- వ్యభిచార స్త్రీని తీసుకొచ్చి రాళ్ళతో చంపమని ఆయనను బలవంతం చేస్తున్నప్పుడు పిల్లల దగ్గరనుండి పెద్దవాళ్ళ పాపములు సహా ఆయన నేల మీద వ్రాసాడంటే ఆయన ఎలోహీం గాక నీకు - నాకు లాంటి ఒక సాధారణ మనిషా? యోహాను 8:1-11
- చేప కడుపులోని షెకెలును చూసిన యషువ మెస్సీయ (మత్తయి 17:24-27) ఎవరనుకుంటున్నావు?
- సముద్రతరంగముల మీద నడిచిన యషువ మెస్సీయ యావె కాడా(యోబు 9:8 మత్తయి 14:25)
- పాపములను క్షమించు అధికారము ఎలోహీంకు తప్ప ఎవరికి కలదు? మరి ఈయన పాపములను క్షమించుట ఏమి సూచించుచున్నది? (మత్తయి 9:1-8)
- గాలిని సముద్రమును గద్దించినపుడు ఈయన సృష్టికర్త అని ఋజువు చేసుకున్నట్లేగదా! మత్తయి 8:34-37
- ఒకానొక కాలములో దయ్యములను అగ్నికి గురిచేసేవాడు ఈయనే అని దయ్యములు గుర్తించాయి అంటే ఈయన శరీరధారియైన ఎలోహీం అని వాటికి తెలిసినట్లే కదా! మత్తయి 8:28-34
- యావె అద్వితీయుడైన యావె (ద్వితీ 6:4) యషువ మెస్సీయ అద్వితీయుడైన కుమారుడు (యోహాను 3:16) అద్వితీయుడంటే ద్వితీయుడు కాని వాడని అర్థం. ద్వితీయుడు కాని వాడంటే రెండవవాడు కాడని అర్థం. రెండవవాడు కానివాడంటే మొదటివాడనే గదా!
- సమరయ స్త్రీ యూదుడవైన నీవు, 2. అయ్యా 3. నీవు ప్రవక్తవు 4. మెస్సీయ అని సంబోధించి ఆఖరికి సమరయులద్వారా "లోకరక్షకుడని" నమ్మింపజేసిందంటే లోకరక్షకుడు ఎవరు?

ఈయన ఇశ్రాయేలీయులను రక్షించుటకు పంపబడిన రక్షకులలాంటివాడు కాడు (న్యాయాధి 3:9,15, ఓబద్యా 1:21) లోకరక్షకుడు (లూకా 1:8, 2:11-14, యోహాను 1:29)

ఈ యషువ మెస్సీయ సర్వాధికారియైన ఎలోహీం గనుకనే ప్రవక్తలతో పోల్చదగినవాడు కాడు, జ్ఞానులతో పోల్చదగినవాడు కాడు, పాతనిబంధన గ్రంథంలో తన ఆలోచనల యందు కేవలం కొన్ని ప్రవచనాల రూపంలో తన గ్రంథంలో వ్రాయించుకొని వాటికి అనుగుణంగా తగిన సమయమందు శరీర రీతిగా ప్రత్యక్షమై వాటి నెరవేర్పులను ఈయన సంపూర్తి చేసాడు. చాలామందికి నాడు-నేడు-రేపు కూడా ఈయన ఒక వివాదాస్పద గురుతుగానే ఉంటాడు లూకా 2:34.

అనేకములైన ఈయన మాటలు అనేకమంది అపార్థము చేసుకున్నవి కూడా లేకపోలేదు. ఈయన అందరికీ అర్థమయ్యే ఎలోహీం కాడు.

యషువ మెస్సీయ కాలములోనే అనేకమందికి అర్థం కాని ఈ ఎలోహీమయిన యషువ మెస్సీయ. అపోస్తులుల అనంతరం : ఈయన ఒక్కరా? ఇద్దరా? లేక ముగ్గురా? అనే ఆలోచనలతోను, అభిప్రాయములతోను అనేక బోధకులు, అబద్ధబోధకులు వారి వారి పాండిత్యమును ప్రజలకు చాటించుకొనుచూ, కొందరైతే ఇద్దరిని (తండ్రి-కుమారుడు) మరికొందరు ముగ్గురని (తండ్రి-కుమారుడు-పరిశుద్ధాత్ముడు) దిత్వ-త్రిత్వ సిద్ధాంతములను ప్రవేశపెట్టారు. దానికి అనుగుణంగా పాతనిబంధనలోని వాక్యములను అనగా మనపోలికె చొప్పున, మన స్వరూపమున, మనము దిగిపోయి, మనలో ఒకనివంటివాడు, మా నిమిత్తము మొ॥గు మాటలకు తప్పుడు అర్థాలు కల్పించి పనికిమాలిన కామెంట్రీస్ వ్రాయడంతో యూదులలో అనేకులు ఈయన యందు విశ్వాసముంచకుండా పోవడానికి కారణమయ్యింది. యూదులు ఈయనను మెస్సీయగా అంగీకరించకపోవడానికి కూడా వాళ్ళకు గల కారణాలు వాళ్ళకు ఉన్నవి. వాళ్ళు అనుకున్న రీతిగా వాళ్ళు తప్పుగా ఎదురుచూసిన రీతిగా మెస్సీయ కనిపించకపోవడంతో వాళ్ళు ఈయనను త్రోసివేయడం జరిగింది. ఆ విధంగా ఈయన ఒక "నిషేధించిన రాయి"గా అయ్యాడు. ఈయనను నమ్మిన వారు మాత్రం ఈయనే యావె అని నమ్మి వాళ్ళ రక్షణను వాళ్ళు కొనసాగిస్తున్నారు. అపోస్తులుల అనంతరం వచ్చిన అబద్ధబోధకుల ద్వారా 2 శతాబ్దం నుండి ఈ దిత్వ-త్రిత్వ సిద్ధాంతం అమలులోకి వచ్చింది. మొట్టమొదటిగా త్రిత్వము అనే మాటను ప్రవేశపెట్టినది టెర్టూలియన్ అనే వ్యక్తి. చర్చి హిస్టరీ చదివితే ఈ విషయం మీకు తెలుస్తుంది. అపోస్తులులెవరూ త్రిత్వ-దిత్వ సిద్ధాంతాన్ని బోధించలేదు. వాళ్ళంతా యూదులు గనుక ఎలోహీం ఒక్కడే అని బోధించారు. అపోస్తులుల కార్యములనుండి మీరు ఎక్కడ చూసినా వారు యషువ మెస్సీయనే బోధించినట్లు చూడగలం.

మెస్సీయ అనంతరం 600 సం॥రాల తర్వాత వచ్చిన ముస్లిముల ఖురాన్ గ్రంథం సహితం మెస్సీయను ఒక ప్రవక్తగా నమ్మునట్లు చేసిందేగాని ఎలోహీంగా నమ్మడానికి ఒప్పుకోలేదు. వాస్తవానికి అనాదికాలంనుండి అనగా ఆదాము-హవ్వల దగ్గరనుండి మోషే వరకూ, పరమతండ్రికి-భక్తులకు మధ్యవర్తులు లేరు. ఇది యూదులు-ముస్లిములు-క్రైస్తవులు గుర్తించవలసిన విషయం. మోషే దగ్గరకు వచ్చిన దగ్గరనుండే ఇశ్రాయేలీయులు భయపడిపోయి మోషేను మధ్యవర్తిగా పెట్టుకున్నారు. గలతీ 3:19

ప్రజలందరు ఆ ఉరుములు ఆ మెరుపులు ఆ బూరధ్వనియు ఆ పర్వత ధూమమును చూచి భయపడి తొలగి దూరముగా నిలిచి మోషేతో ఇట్లనిరి -నీవు మాతో మాటలాడుము మేము విందుము; ఎలోహీం మాతో మాటలాడిన యెడల మేము చనిపోవుదుము. అందుకు మోషే - భయపడకుడి; మిమ్మును పరీక్షించుటకును, మీరు పాపము చేయకుండునట్లు ఆయన భయము మీకు కలుగుటకును, ఎలోహీం వేంచేసెనని ప్రజలతో చెప్పెను. ప్రజలందరు దూరముగా నిలిచిరి. మోషే ఎలోహీం ఉన్న ఆ గాఢాంధకారమునకు సమీపింపగా యావె మోషేతో ఇట్లనెను-ఇశ్రాయేలీయులతో ఈలాగు చెప్పుము-నేను ఆకాశములోనుండి మీతో మాటలాడితినని మీరు గ్రహించితిరి. నిర్గమ 20:18-22

యోబు భక్తుడు ఎలోహీంతో మాట్లాడుతూ: "మా ఇద్దరి మధ్య చేయి ఉంచదగిన మధ్యవర్తి మాకు లేడు" అని అంటున్నాడు యోబు 9:33 పరమతండ్రియైన యావె చూచినప్పుడు కూడా మధ్యవర్తి లేకపోవుట వలన తన బాహువే తనకు సహాయం చేసుకున్నట్లుగా యెషయా 59:14-16 ఋజువు పరుస్తుంది. మధ్యవర్తి

యొకనికి మధ్యవర్తి కాదు గాని ఎలోహీం ఒక్కడే అని గలతీ 3:20 చెప్తుంది. గనుక మధ్యవర్తుల అవసరత అనాది కాలం నుండీ లేదు గాని తర్వాత మాత్రమే వచ్చింది. మోషేకు ముందు పరమతండ్రికీ-మనుష్యులకు మధ్య మధ్యవర్తులు లేరు. ఒకే ఒక్కడు ఉన్నాడు, వాడే మనుష్యుల చేత పాపములను చేయించిన సాతానుడు. వాడే మధ్యవర్తిగా దూరి ఆదాము-హవ్వలకు పాపము చేయడానికి కారణమయ్యాడు. ఇలాంటి మధ్యవర్తులు చాలా ప్రమాదం. రోమన్ కథోలిక్ గురువులైన పోపులు ఏమంటున్నారంటే దేవునికి మనుష్యులకు మధ్యవర్తులు వారేనంట. అందుకే మనం చేసే పాపములు వారి చెవులలో చెపితే వారు వెళ్ళి దేవుడికి చెప్పి మనకు పాపక్షమాపణ కలిగిస్తారట. వీరే సాతాను మధ్యవర్తులు. రోమన్ కథోలిక్కులు కేథలిక్స్, వారినుండి బయటకు వచ్చినవారు ప్రొటెస్టెంట్స్ అంటే లూథరన్ మిషన్ నుండి వచ్చిన మతశాఖలు కాని వీరందరికంటే ముందున్నది అపోస్తలుల సమాజము. వాళ్ళు యరూషలేమునుండి సువార్త బోధిస్తుంటే; కేథలిక్కు + ప్రొటెస్టెంట్స్ రోమ్ నుండి సువార్త బోధిస్తున్నారు. వీళ్ళతో సరిసమానంగా అరబ్బుదేశాలనుండి ముస్లిములు సువార్త బోధిస్తున్నారు. వీళ్ళ ముగ్గురి సువార్త :వేరొక సువార్త. ముస్లిములు తమ గ్రంథంలో కూడా మేము, మా అనే పదాలు ఉపయోగించారు కాని వాటి అర్థం అల్లాహ్+దూతలు అని చెపుతారు. అదే విధంగా యూదులు మనపోలికె చొప్పున, మనము, మనస్వరూపము అనే మాటలు పరమతండ్రియైన యావె+యావె దూతలు అని ఒప్పుకుంటారు. ఎటొచ్చి క్రైస్తవులు (అంటే కేథలిక్స్+ప్రొటెస్టెంట్స్) మాత్రం వీటికి విపరీత అర్థాలు తీసి నాశనమునకు నడిపిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ఈ మోసాన్ని కేవలం పరమతండ్రి బిడ్డలు మాత్రమే ఛేధించగలరు గాని మరెవ్వరి వలన కాదు : ఒకే ఎలోహీంకి రావలసిన ఘనతను ముగ్గురు దేవుళ్ళకు ఆపాదించి చాలా మోసం చేస్తున్నారు. యూదులు+ముస్లిములు ఎలోహీం శరీరధారిగా వచ్చాడంటే నమ్మరు. మరి అబ్రాహాము నొద్దకు వచ్చిన యావె+ఇద్దరు దూతలను ఎలా నమ్ముతున్నారు? ఎలోహీం అవతారం ఎత్తడు, ఎత్తకూడదు అనేది వారి నినాదం. ఎలోహీం అంటే ఇలాగు ఉండాలి లేదా ఆలాగు ఉండాలి అనడానికి మనం ఎవరము? ఆయన ఎలాగైనా ఉండగలడు. ఏమైనా చేయగలడు. కాదనడానికి మానవులు ఎంతవరకూ? కొంతమంది యూదులు+ముస్లిములు+క్రైస్తవుల పిచ్చి ప్రశ్నలేమంటే:

- యషువ మెస్సీయయే ఎలోహీం అయితే ఎందుకు ప్రార్థన చేసాడు?
- యషువ మెస్సీయయే ఎలోహీం అయితే ఎవరికి ప్రార్థన చేసాడు?
- యషువ మెస్సీయయే ఎలోహీం అయితే నా తండ్రి నాకంటే గొప్పవాడని ఎందుకన్నాడు?
- యషువ మెస్సీయయే ఎలోహీం అయితే రాకడను గూర్చిన సమయం ఎందుకు తెలియదన్నాడు?
- యషువ మెస్సీయయే ఎలోహీం అయితే తండ్రీ! నా ఆత్మను నీకప్పగించుచున్నానని ఎందుకన్నాడు?
- యషువ మెస్సీయయే ఎలోహీం అయితే సమాధినుండి ఎందుకు తండ్రిచే లేపబడ్డాడు?
- యషువ మెస్సీయయే ఎలోహీం అయితే సాధారణ మనిషిలా ఎందుకు ఏడ్చాడు?
- యషువ మెస్సీయయే ఎలోహీం అయితే ఎందుకు నిద్రపోయాడు?
- యషువ మెస్సీయయే ఎలోహీం అయితే ఎందుకు అలసిపోయాడు?
- యషువ మెస్సీయయే ఎలోహీం అయితే ఎందుకు చనిపోయాడు?
- యషువ మెస్సీయయే ఎలోహీం అయితే మంచివాడొక్కడే అని ఎందుకు అన్నాడు?
- యషువ మెస్సీయయే ఎలోహీం అయితే పంపబడినవాడిని అని ఎందుకు అన్నాడు?
- యషువ మెస్సీయయే ఎలోహీం అయితే ఈ గిన్నె నాయొద్ద నుండి తొలగించుమని ఎందుకు అన్నాడు?
- యషువ మెస్సీయయే ఎలోహీం అయితే ఎందుకు సాతానుచేత శోధించబడ్డాడు?
- యషువ మెస్సీయయే ఎలోహీం అయితే సమస్తము నా తండ్రి ద్వారా నాకు లభించిందని ఎందుకు అన్నాడు?

మొ॥గు పిచ్చి పిచ్చి ప్రశ్నలు వేస్తూ ఉంటారు. ఈ మూడు తెగల వారూ యషువ మెస్సీయను కేవలం ఒక ప్రవక్తగా, ఎలోహీం కుమారునిగా, త్రిత్వంలో రెండవ వ్యక్తిగా అంగీకరిస్తారు గాని "ఆయన శరీరం ధరించివచ్చిన యావె" అంటే నమ్మరు, నమ్మలేరు, నమ్మనివ్వరు. పైగా ఎగతాళి చేస్తుంటారు. కౌంటర్ వాక్యాలు తీసి వివాదములకు, వాదములకు వస్తూ ఉంటారు. వీళ్ళని బాగుచెయ్యడం చాలా కష్టం. ఎందుకంటే, అపోస్తలుడైన సౌలు సహితం ఒకానొక సమయములో "కళ్ళు పొరలు కప్పి" అలాగే అనుకున్నాడు. యషువ మెస్సీయను సంధించాక, ఆయన ద్వారా బోధించబడిన తరువాత అతను తన బోధను మార్చుకున్నాడు. వీళ్ళకీ అదే స్తితి వచ్చేవరకూ వీళ్ళూ నమ్మరు. గనుక వారికోసం బాధపడాల్సిందిలేదు.

అపోస్తలుడైన సౌలు 1కొరింథీ 12:3లో చెప్తున్నాడు. "పరిశుద్ధాత్మ వలన తప్ప ఎవడును యషువ యావెయని చెప్పలేడనియు" అంటున్నాడు. గనుక పరిశుద్ధాత్మ లేకుండా అక్షరజ్ఞానంతో బైబిలు చదివే ఎవరికీ యషువ మెస్సీయ యావె కాదు అంతే:

- యషువ మెస్సీయ అందరికీ యావె అ॥కార్య 10:36
- అప్పుడు యావె నామమునుబట్టి ప్రార్థన చేయువారందరూ రక్షణ పొందుదురు అ॥కార్య 2:21
- యషువ మెస్సీయ దావీదునకు యావె (ప్రభువు) మత్తయి 22:41-46 (ఆయన దావీదు కుమారుడు కాడు)
- తోమా ఆయనను యావెగా గుర్తించాడు యోహాను 20:28
- ఫిలిప్పు ఆయనను తండ్రిగా గుర్తించాడు యోహాను 14:8,9
- అపోస్తలుడైన సౌలు గుర్తించాడు అ॥కార్య 9:27

యషువ మెస్సీయయే ఆల్ ఇన్ ఆల్ అనే సంగతి ఆయన గొఱ్ఱెలకు బాగుగా తెలుసు. గనుక యషువ మెస్సీయను గూర్చిన విషయంలో అనుమానములు ఏమైనా వుంటే మాకు వ్రాయండి. మేమే మీ సందేహములను వాక్య వెలుగులో చెపుతాము. మన పరమతండ్రియైన యషువ మెస్సీయ కృప సమాధానము మనందరికీ కలుగును గాక!

# ఆది అపోస్తలులు ఇచ్చిన బాప్తీస్మములు

ఆది అపోస్తలులు రక్షకుడైన యషువ మెస్సీయ నామంలో నీళ్ళలో ముంచి బాప్తీస్మములు ఇవ్వడం

**1. పేతురు మరియు ఇతర శిష్యులు:**

అ॥కార్య 2:38 పేతురు-మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యషువ మెస్సీయ నామమున బాప్తీస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు.
అ॥కార్య 2:41 కాబట్టి అతని వాక్యము అంగీకరించినవారు బాప్తీస్మము పొందిరి; ఆ దినమందు ఇంచుమించు మూడువేలమంది చేర్చబడిరి.

**2. ఫిలిప్పు బాప్తీస్మమిచ్చుట:**

అ॥కార్య 8:12 అయితే ఫిలిప్పు ఎలోహీం రాజ్యమును గూర్చియు యషువ మెస్సీయ నామమును గూర్చియు సువార్త ప్రకటించుచుండగా వారతని నమ్మి, పురుషులును స్త్రీలును బాప్తీస్మము పొంది ఫిలిప్పును ఎడబాయకుండి, సూచకక్రియలును గొప్ప అద్భుతములును జరుగుట చూచి విభ్రాంతి నొందెను.
అ॥కార్య 8:16 అంతకు ముందు వారిలో ఎవనిమీదను ఆయన దిగియుండలేదు, వారు సర్వాధికారియైన యషువ నామమున బాప్తీస్మము మాత్రము పొందియుండిరి.

**3. ఫిలిప్పు సీమోనుకు బాప్తీస్మము ఇచ్చుట:**

అ॥కార్య 8:13 అప్పుడు సీమోను కూడ నమ్మి బాప్తీస్మము పొంది ఫిలిప్పును ఎడబాయకుండి, సూచకక్రియలును గొప్ప అద్భుతములును జరుగుట చూచి విభ్రాంతి నొందెను.

**4. ఫిలిప్పు నపుంసకునికి బాప్తీస్మమిచ్చుట:**

అ॥కార్య 8:36-38 వారు త్రోవలో వెళ్ళుచుండగా నీళ్ళున్న యొక చోటికి వచ్చినప్పుడు నపుంసకుడు-ఇదిగో నీళ్లు; నాకు బాప్తీస్మమిచ్చుటకు ఆటంకమేమని అడిగి రథము నిలుపుమని ఆజ్ఞాపించెను. ఫిలిప్పు నపుంసకుడు ఇద్దరును నీళ్ళలోనికి దిగిరి. అంతట ఫిలిప్పు అతనకి బాప్తీస్మమిచ్చెను.

**5. అననీయ సౌలుకు బాప్తీస్మమిచ్చుట:**

అ॥కార్య 9:18 అప్పుడే అతని కన్నులనుండి పొరలవంటివి రాలగా దృష్టికలిగి, లేచి బాప్తీస్మము పొందెను; తరువాత ఆహారము పుచ్చుకొని బలపడెను.

**6. పేతురు కొర్నేలికి బాప్తీస్మమిచ్చుట:**

అ॥కార్య 10:47 అందుకు పేతురు - మనవలె పరిశుద్ధాత్మను పొందిన వీరు బాప్తీస్మము పొందకుండ ఎవడైనను నీళ్ళకు ఆటంకము చేయగలడా అని చెప్పి యషువ మెస్సీయ నామమందు వారు బాప్తీస్మము పొందవలెనని ఆజ్ఞాపించెను. తరువాత కొన్ని దినములు తమయొద్ద ఉండుమని వారతని వేడుకొనిరి.

**7. అపోస్తలుడైన సౌలు లూదియకు బాప్తీస్మమిచ్చుట:**

అ॥కార్య 16:14,15 అప్పుడు లూదియయను యావెభక్తిగల యొక స్త్రీ వినుచుండెను. ఆమె ఊదారంగు పొడిని అమ్మ తుయతైర పట్టణస్థురాలు. సర్వాధికారి ఆమె హృదయము తెరచెను గనుక సౌలు చెప్పిన మాటలయందు లక్ష్యముంచెను. ఆమెయు ఆమె యింటివారును బాప్తీస్మము పొందినప్పుడు ఆమె-నేను సర్వాధికారినందు విశ్వాసము గలదాననని మీరు యెంచితే, నా యింటికి వచ్చియుండుడని వేడుకొని మమ్మును బలవంతము చేసెను.

**8. సౌలు, సీలయు చెరసాల నాయకునికి బాప్తీస్మమిచ్చుట:**

అ॥కార్య 16:30-33 వారిని వెలుపలికి తీసుకొని వచ్చి-అయ్యలారా, రక్షణ పొందుటకు నేనేమి చేయవలెననెను. అందుకు వారు - సర్వాధికారియైన యషువ నందు విశ్వాసముంచుము అప్పుడు నీవును నీ యింటివారును రక్షణ పొందుదురని చెప్పి అతనికిని అతని ఇంటనున్నవారికందరికిని ఎలోహీం వాక్యము బోధించిరి. రాత్రి ఆ గడియలోనే అతడు వారిని తీసికొనివచ్చి, వారి గాయములు కడిగెను; వెంటనే అతడును అతని యింటివారందరును బాప్తీస్మము పొందిరి.

**9. సౌలు క్రిస్పునకు బాప్తీస్మమిచ్చుట:**

అ॥కార్య 18:8 ఆ సమాజమందిరపు అధికారియైన క్రిస్పు తన యింటివారందరితో కూడ సర్వాధికారినందు విశ్వాసముంచెను. మరియు కొరింథీయులలో అనేకులు విని విశ్వసించి బాప్తీస్మము పొందిరి. 1కొరింథీ 1:14 నా నామమున మీరు బాప్తీస్మము పొందితిరని యెవరైనను చెప్పకుండునట్లు, క్రిస్పునకును గాయియుకును తప్ప మరి యెవరికిని నేను బాప్తీస్మమియ్యలేదు. అందుకై ఎలోహీంకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి

**10. సౌలు అనేకులకు బాప్తీస్మము ఇచ్చుట:**

అ॥కార్య 18:8 ఆ సమాజమందిరపు అధికారియైన క్రిస్పు తన యింటివారందరితో కూడ సర్వాధికారినందు విశ్వాసముంచెను. మరియు కొరింథీయులలో అనేకులు విని విశ్వసించి బాప్తీస్మము పొందిరి.

**11. సౌలు అకుల ప్రిస్కిల్లకు బాప్తీస్మము ఇచ్చుట:**

అ॥కార్య 18:24-26,28 అలెక్సంద్రియవాడైన అపొల్లో అను ఒక యూదుడు ఎఫెసునకు వచ్చెను. అతడు విద్వాంసుడును లేఖనములయందు ప్రవీణుడునై యుండెను. అతడు సర్వాధికారి మార్గము విషయమై ఉపదేశము పొంది తన ఆత్మయందు తీవ్రపడి, యోహాను బాప్తీస్మముమాత్రమే తెలిసికొనినవాడైనను, యషువను గూర్చిన సంగతులు వివరముగా చెప్పి బోధించుచు, సమాజమందిరములో ధైర్యముగా మాటలాడ నారంభించెను. ప్రిస్కిల్ల అకులయు విని అతని చేర్చుకొని ఎలోహీం మార్గము మరి పూర్తిగా అతనికి వశదపరచిరి.

**12. సౌలు బాప్తీస్మమిచ్చు యోహాను శిష్యులకు బాప్తీస్మమిచ్చుట:**

అ॥కార్య 19:1-7 అపొల్లో కొరింథులో నున్నప్పుడు జరిగినదేమనగా, సౌలు పైప్రదేశములో సంచరించి ఎఫెసునకు వచ్చి కొందరు శిష్యులను చూచి-మీరు విశ్వసించినప్పుడు పరిశుద్ధాత్మను పొందితిరా? అని వారినడుగగా వారు పరిశుద్ధాత్ముడున్నాడన్న సంగతియే మేము వినలేదని చెప్పిరి. అప్పుడతడు ఆలాగైతే మీరు దేనిని బట్టి బాప్తీస్మము పొందితిరని అడుగగా వారు యోహాను బాప్తీస్మమునుబట్టియే అని చెప్పిరి. అందుకు సౌలు యోహాను తన వెనుక వచ్చువానియందు, అనగా యషువ నందు విశ్వాసముంచవలెనని ప్రజలతో చెప్పుచు, మారుమనస్సు విషయమై బాప్తీస్మమిచ్చెనని చెప్పెను. వారు ఆ మాటలు విని సర్వాధికారియైన యషువ నామమున బాప్తీస్మము పొందిరి. తరువాత సౌలు వారిమీద చేతులుంచగా పరిశుద్ధాత్మ వారమీదికి వచ్చెను. అప్పుడు వారు భాషలలో మాటలాడుటకును ప్రవచించుటకును మొదలు పెట్టిరి. వారందరు ఇంచుమించు పండ్రెండుగురు పురుషులు.

**13. సౌలు గాయినకు బాప్తీస్మమిచ్చుట:**

1కొరింథీ 1:14 నా నామమున మీరు బాప్తీస్మము పొందితిరని యెవరైనను చెప్పకుండునట్లు, క్రిస్పునకును గాయియుకును తప్ప మరి యెవరికిని నేను బాప్తీస్మమియ్యలేదు. అందుకై ఎలోహీంకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి

**14. సౌలు స్తెఫను ఇంటివారికి బాప్తీస్మమిచ్చుట:**

1కొరింథీ 1:16 స్తెఫను ఇంటివారికిని బాప్తీస్మమిచ్చితిని; వీరికి తప్ప మరి ఎవరికైనను బాప్తీస్మమిచ్చితినేమో నేనెరుగను.

**15. సౌలు గలతీయులకు బాప్తీస్మమిచ్చుట:**

గలతీ 3:27 మెస్సీయలోనికి బాప్తీస్మము పొందిన మీరందరు మెస్సీయను ధరించుకొనియున్నారు.
అ॥కార్య 4:12 మరి ఎవనివలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము.

అపోస్తలులు బోధించిన నామము యషువ మెస్సీయ(మొదటి శతాబ్దము)
రోమన్స్ బోధించే నామము ఈసోస్ క్రిస్టోస్ (2వ శతాబ్దము)
ఇంగ్లీష్ వారు బోధించిన నామము జీసస్ క్రైస్ట్ (17వ శతాబ్దము)
హిందీవారు బోధించిన నామము ఈసామస్సీ (18వ శతాబ్దము)
తెలుగువారు బోధించే నామము యేసుక్రీస్తు (1818లో వచ్చింది)

కాని మనం వెంబడించవలసింది అపోస్తలులు ఉపయోగించిన నామమే. ఈ నామములోనే రక్షణ (అ॥కార్య 4:12) అపోస్తలులు, ఆనాటి విశ్వాసులందరూ యషువ మెస్సీయ నామముననే బాప్తీస్మములు పొంది బాప్తీస్మములు యిచ్చినారు. ఆనాడు శాస్త్రులు, పరిసయ్యులు, సద్దుకయ్యులు, ప్రధానయాజకులు ఆ నామమును బోధించవద్దని అపోస్తలులను రకరకాలుగా హింసించారు. నేడు వారి ఆత్మే క్రైస్తవ బోధకులలో ఉండి యషువ మెస్సీయ నామమును బోధించువారిని రకరకాలుగా బాధించుచూ, హింసించుచున్నారు. క్రైస్తవ విశ్వాసులను గూర్చి యషువ ఒక మాట చెప్పాడు యోహాను 5:43 చదవండి. "నేను నా తండ్రి నామమున వచ్చియున్నాను; మీరు నన్ను అంగీకరింపరు. మరియొకడు తన నామమున వచ్చిన యెడల వానిని అంగీకరింతురు." చూసారా! ఆయన చెప్పినట్లే జరుగుతుంది. ఈనాడు చాలామంది క్రైస్తవబోధకులు, విశ్వాసులు "యషువ మెస్సీయ" నామం అనగానే హేవ్యభావం వ్యక్తపరుస్తున్నారు. కొందరైతే అది మాకు తిరగడం లేదని, మరి కొందరైతే అసలు నామంతో సంబంధం లేదని, అది హెబ్రీలో అలాగని : ఇలా రకరకాల సాకులు చెపుతూ రక్షణ నామమును త్రోసిపుచ్చి వేస్తున్నారు. ఈ నామమునే అసహ్యించుకుంటున్నారు. పిచ్చి పిచ్చి వ్యాఖ్యానాలు చేస్తున్నారు. ఈ నామమును బోధించువారిని అబద్ధబోధకులని కూడా బోధకులు ప్రచారం చేస్తున్నారు. ఈ నామం విషయంలో అపోస్తలులు అవమానం పాలుపొందారు చదవండి (అ॥కార్య 4:17,18, 5:40,41) ఆది అపోస్తలులు బాప్తీస్మము యిచ్చినట్లుగా ఒక్క క్రైస్తవ బోధకుడు కూడా యషువ మెస్సీయ నామమున బాప్తీస్మములు యివ్వడం లేదు. తండ్రి కుమార పరిశుద్ధాత్మ అంటూ బిరుదులలో బాప్తీస్మములు ఇస్తున్నారు. జీసస్ క్రైస్ట్ అని అంటూ ఇంగ్లీషు వారు మోసం చేస్తున్నారు. మన తెలుగు పాస్టర్లు కూడా తండ్రి కుమార పరిశుద్ధాత్మ అంటూ మరి కొందరు యేసుక్రీస్తు నామము అంటూ ముంచి తప్పుడు బాప్తీస్మములు ఇస్తున్నారు. వాటి ద్వారా రక్షణ అనేది పొందడం జరగని పని. - యషువ మెస్సీయ నామములో బాప్తీస్మము పొందలేనివారికి రక్షణ లేదు. యషువ మెస్సీయ నామమును బోధించనివారు అబద్ధబోధకులే. యషువ మెస్సీయ నామమును గౌరవించని వారు ఎవరైనా వారు నూటికి నూరుశాతం సాతాను సంబంధులే అని గుర్తించుకొని ఆయన నామమును గౌరవించడం నేర్చుకోండి (ప్రకటన 14:1)

# తెలివి, వివేచన లేని క్రైస్తవ జనాంగం

**యావె మాటలాడుచున్నాడు ఆకాశమా, ఆలకించుము; భూమీ, చెవియొగ్గుము. - నేను పిల్లలను పెంచి గొప్పవారినిగా చేసితిని. వారు నా మీద తిరుగబడియున్నారు. ఎద్దు తన కామందు నెరుగును గాడిద సొంతవాని దొడ్డి తెలిసికొనును. ఇశ్రాయేలునకు తెలివిలేదు నా జనులు యోచింపరు.** అని సైన్యములకు అధిపతియైన యావె సెలవిచ్చుచున్నాడు. ఆయన పేరు పెట్టబడిన ఈ జనాంగం (యహుదీయులు) ఆయన చేత ఎన్నుకోబడి, ఆయన చేత అత్యధికంగా ఆశీర్వదింపబడిన ఈ ప్రజలు తమ ఆశీర్వాదానకి కారణభూతుడైన **"యావె"**ను మరచి విగ్రహాలను పూజించడం చాలా విచారించదగిన విషయం. మెసపొతమియ దేశములో యితర దేవతలను పూజించుచున్న అబ్రహామునకు **"యావె"** ప్రత్యక్షుడై, అతనిని కనానుకు తోడుకొని వచ్చి అక్కడ నివసింపజేసి, ఒక్క కుమారుడు కూడా పుట్టని అబ్రాహాముతో కనానును అతని సంతానానికి ఇస్తానని వాగ్దానము చేసి అతనికి వయసు ఉడిగిపోయి అతని భార్య శారా ఇక ఏ మాత్రం గర్భం దాల్చడానకి అవకాశం లేని వయసులో ఇస్సాకును సంతానంగా ఇచ్చి వారి ఇంట నవ్వులు (ఇస్సాకు అంటే నవ్వు) పూయించాడు ఎలోహీమైన యావె. ఇస్సాకునకు యాకోబు, ఏశావులను ఇచ్చాడు. వారి వారి సంతానాలను లెక్కకు మిక్కిలిగా విస్తరింపజేశాడు. యాకోబు కుమారులు ఐగుప్తులోనికి వెళ్లి 70మంది అల్లా 7లక్షలకు పైబడి వారు అభివృద్ధి చెందారు. ఐగుప్తులో నానా కఠినమైన చాకిరి చేయుచున్న తన ప్రజలను మోషే, అహరోనులను పంపి వారిని ఐగుప్తులోనుండి వెలుపలికి తీసుకొని వచ్చాడు.

తన ప్రజలకొరకు ఎఱ్ఱసముద్రములో వారికి త్రోవను కలుగజేసి వారు సురక్షితముగా దాటిన తర్వాత అదే సముద్రంలో వారి శత్రువులైన ఐగుప్తీయులను ముంచివేసాడు. అక్కడినుండి మొదలుపెట్టారు ఇశ్రాయేలీయులు సణగడం!! ఐగుప్తులో చేసిన అద్భుత కార్యాలన్నీ కళ్ళారా చూసినా పదిసార్లు ఇశ్రాయేలీయులు పరమతండ్రికి విరోధంగా సణిగారు. ఎలోహీం దూతలు తినే మన్నాతో పోషిస్తున్నా సరే మాంసం కావాలని ఏడ్చారు. వీళ్ళ సణుగుళ్ళు, గొణుగుళ్ళు చూసిన పరమతండ్రి ఆగ్రహం తెచ్చుకొని ఐగుప్తులోనుండి బయలుదేరిన వారిలో యెహోషువ, కాలేబుల కుటుంబాలు తప్ప మిగిలినవారందరిని అరణ్యంలోనే హతం చేసాడు.
వీళ్ళు ఎంత దారుణంగా ప్రవర్తించినా అబ్రాహాముతో తాను చేసిన నిబంధన జ్ఞాపకం చేసుకొని వారిని పాలు తేనెలు ప్రవహించే కనాను దేశంలో ప్రవేశపెట్టాడు పరమతండ్రియైన యావె. సీనాయి పర్వతం మీద మోషే ద్వారా నీతి యుక్తమైన ఆజ్ఞలును, కట్టడలును గల ధర్మశాస్త్రమును ఇచ్చి వారితో నిత్యనిబంధన చేశాడు. అయితే ఇశ్రాయేలీయులు మాత్రం ఎప్పటికప్పుడు ఆయనను త్రోసివేసి, యితర దేవతలను పూజించేవారు. వారు అలా చేసినప్పుడల్లా వారి శత్రువుల చేతికి అప్పగించేవాడు ఎలోహీమైన యావె. మరల వారు ఆయన వైపు తిరిగి మొఱ్ఱపెట్టినప్పుడు వారి శత్రువుల చేతిలోనుండి విడిపించేవాడు. ఇలా చాలా సార్లు జరుగుతూ ఉండేది. ఒకానొక సమయంలో వీరి విగ్రహారాధన తారాస్థాయికి చేరింది. బబులోనీయులు పూజించే అష్తారోతు దేవతకు నైవేద్యాలు, పానీయార్పణలు అర్పించడం, తమ్మూజు దేవతను గురించి ఏడ్వడం వంటి నీచమైన పనులు చేసి యావెకు రోషం పుట్టించారు. అప్పుడు పరమతండ్రి వారిని బబులోనీయులకు అప్పగించాడు 70 సం॥రాలు. వారు బబులోను చెరలో ఉన్నారు. వారు ఎన్ని నీచమైన కార్యాలు చేసినా వారి పితరులైన అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులతో చేసిన వాగ్దానం నిమిత్తం వారని విగ్రహారాధననుండి తన వైపు మళ్ళించడానికి ఎంతోమంది ప్రవక్తలను పెందలకడే పంపుచూ వచ్చినా, వారు ఆ ప్రవక్తల మాటలు వినకుండా ఆ ప్రవక్తలలో కొందరిని చంపి, కొందరిని కొట్టి, చెరసాలలో పెట్టించేవారు. దీని ఫలితంగా వీరిని రోమీయులకు అప్పగించాడు పరమతండ్రి. అయినా వీరి మూర్ఖత్వం నానాటికి పెరిగిందే కాని తగ్గలేదు. చివరకు తానే శరీరధారిగా దిగివచ్చి వారికి ఎన్నో సంగతులు బోధించినా, ఎన్నో ఆశ్చర్యకార్యాలు, సూచక క్రియలు వారి మధ్య జరిగించినా ఇశ్రాయేలీయులు ఆయన ఎవరో తెలుసుకోలేకపోయారు. సైన్యములకు అధిపతియగు "యావె"ను, అత్యున్నత సింహాసనంపై ఆసీనుడైయుండి నిరంతరం పరిశుద్ధుడు పరిశుద్ధుడు పరిశుద్ధుడు అని సమస్త దూతగణములతో కొనియాడబడే "యావె"ను బయెల్జెబూలు (దయ్యాలకు అధిపతి) అని నిందించారు. జీవాధిపతియైన "యావె"ను మరణానికి అప్పగించారు. అక్కడితోనైనా వీళ్ళు కళ్ళు తెరచి వాస్తవాన్ని గ్రహించారా అంటే అదీలేదు. ఆయన పంపిన అపోస్తలులను కూడా హింసించారు. అసలు ఆయన పేరే ఎత్తకూడదని బెదిరించారు. ఈ విధంగా ఇశ్రాయేలీయులు జరిగించిన హేయమైన కృత్యాలను బట్టి వారు చిందించిన ప్రవక్తల రక్తమును బట్టి, మెస్సీయ రక్తమును బట్టి వీరి మీదకు ఎన్నడు లేనంతగా కఠినమైన శిక్ష వచ్చింది. వీరి పాపమును బట్టి మందిరం నేలమట్టం చేయబడింది. యెరూషలేము అగ్నితో కాల్చబడింది. సీయోను రాళ్ళతో దున్నబడింది. ప్రజలలో అనేకులు చంపబడ్డారు. మిగిలిన వారు ప్రపంచం నలుమూలలకు చెదిరిపోయారు. ఆయా దేశాలలో ఎన్నో బాధలు పడ్డారు. ఇలా దాదాపు 19 శతాబ్దాల వరకు ఇశ్రాయేలీయులు శ్రమలు అనుభవించారు. ఆ తర్వాత వారు తమ సృష్టికర్తయైన "యావె" వైపు తిరిగారు. ఆయా దేశాలలో నుండి వారు పితరుల ఎలోహీమైన యావె మొఱ్ఱపెట్టగా పరమతండ్రి వారిపట్ల జాలిపడి మరల వారిని వాగ్దాన దేశంలో ప్రవేశపెట్టాడు. అక్కడ వారిని పూర్వమున్న దినములలో దీవించినట్లుగా దీవించాడు. వారు ప్రపంచం విస్తుపోయేలా అభివృద్ధి చెందారు. సమాజమందిరాలు నిర్మించుకొని విశ్రాంతిదినములలోనూ, నెలపొడుపు దినములలో ఇతర నియామక దినములలోను కూడుకొనుచు తమ పితరుల ఎలోహీం అయిన "యావె"ను ఆరాధించుచున్నారు. రాబోయే దినములలో వారు మునుపు సొలొమోను కాలంలో నిర్మించబడిన ఆలయంను నిర్మిస్తారని లేఖనములు తెలుపుచున్నవి. వారు తమ రక్షకుడైన "యావె"ను ప్రానువేసిన సంగతి గ్రహించి మిక్కిలిగా దు:ఖిస్తారని, వారు పూర్తిగా యావెవైపు తిరిగి ఆయననే ఆరాధిస్తారని లేఖనములనుండి మనము గ్రహించగలము. ఇప్పుడు శ్రాయేలీయుల ఆత్మీయ పరిస్థితి ఒక గాడిలో పడింది. ఎటొచ్చి క్రైస్తవుల పరిస్థితే చాలా దారుణంగా తయారయ్యింది. క్రైస్తవులు భక్తి విషయంలో చాలా అజ్ఞానంలో ఉన్నారు. వీరు బైబిల్ చేత పట్టుకొని తిరుగుతారు గాని బైబిల్ విషయాలపై ఏమాత్రం అవగాహన లేకుండా ఉన్నారు. బైబిల్‌ను తలక్రింద పెట్టుకుంటున్నారు గాని అందులో విషయాలనుమాత్రం తలకెక్కించుకోవడం లేదు. అసలు సృష్టికర్త ఎవరు? ఆయన పేరు ఏమిటి? ఆయన ఆజ్ఞలు ఏమిటి? మన రక్షకుడెవరు? ఆయన నిజమైన నామం ఏమిటి? ఆయనను మనం ఎప్పుడు ఆరాధించాలి? మొదలైన ప్రాథమిక విషయాలపై కనీస పరిజ్ఞానం లేకుండా పోయింది ఈ క్రైస్తవులకు. ఈ మధ్య ఒక స్నేహితుడు ఫేస్‌బుక్‌లో చాటింగ్ చేస్తూ తండ్రియైన దేవుని నుండియు, ప్రభువైన యేసుక్రీస్తు నుండియు, పరిశుద్ధాత్మ నుండియూ నీకు కృపాసమాధానములు కలుగును గాక! అని అన్నాడు. అదేంటి మనకు ఒక్కరే కదా ఎలోహీం అన్నాను. కాదు ముగ్గురు అన్నాడు నా స్నేహితుడు. ఎవరా ముగ్గురు అని అంటే తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మలు అని అన్నాడు. అయితే సరే మత్తయి 28వ అధ్యాయం 19వ వచనం తీసి చదివించి అక్కడ ఏమి రాయబడి ఉంది అని అడిగితే తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ **నామము**లోనికి బాప్తీస్మం ఇమ్మని ఆయన తన శిష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు అని చెప్పాడు. మంచిది అని చెప్పి అ॥కార్య 2:38 తీసి చదవమన్నాను. అక్కడ పేతురు ఏ నామంలో బాప్తీస్మం ఇచ్చాడు అని అడిగితే యేసుక్రీస్తు నామం అని చెప్పాడు. ఇప్పుడు పై రెండు లేఖనాలను చూస్తే ముగ్గురా లేక ఒకరా? అని ప్రశ్నించాను. మారు మాట్లాడలేకపోయాడు. తండ్రి కుమారుడు పరిశుద్ధాత్ముడు ఒక్కడే. ఆయనే యషువ మెస్సీయ. ఆ నామంలో మాత్రమే బాప్తీస్మము పొందినవారి మీదకు పరిశుద్ధాత్మ వచ్చింది అని చెప్పాను. లేఖనములు ఇంత స్పష్టంగా ఉన్నా ఇంకా మూర్ఖత్వంలోనే ఉండి ఇప్పటికీ తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ అంటూ బాప్తీస్మం ఇస్తున్నారు క్రైస్తవ బోధకులు. దీనివల్ల ఎటువంటి ప్రయోజనం లేదు. రక్షణ ఉండదు, పరిశుద్ధాత్మ పొందలేరు. ఇవి లేకపోతే ఎందుకీ బాప్తీస్మం పొందడం?? (ప్రొటెస్టెంట్‌లలో మేమే తొలివారమని మా సంఘం చాలా పురాతనమైనదని గొప్పలు చెప్పుకునే మతశాఖవారు వారి చర్చిలలో అపోస్తలుల విశ్వాస ప్రమాణం చెపుతారు. ఇలా ఎక్కడ బైబిల్లో లేదు. అయితే ఆది అపోస్తలులందరు చేసిన పని మాత్రం చేయడం లేదు. లేనిది చేయడం, ఉన్నదాన్ని నిర్లక్ష్యం చేయడం సాతానుగాడి, అతని సేవకుల లక్షణం కాబట్టి ఆది అపోస్తలులు "యషువ మెస్సీయ" నామంలో ముంచుడు బాప్తీస్మం ఇస్తే వీరు మాత్రం దానికి పూర్తి రివర్సులో తండ్రీ, కుమార, పరిశుద్ధాత్మ అంటూ చిలకరింపు బాప్తీస్మం ఇస్తున్నారు. ఇది తప్పు అని ఎంతగానో చెబుతున్నా వినడం లేదు. తెలిసీ చేసే వీరి పాపానికి మిషలేదు. చాలా కఠినమైన తీర్పు వీరికి ఉంది. అంతే లేని పాతాళం వీరికోసం ఎదురు చూస్తూ ఉంది.....

ఈ మధ్య ఒక తమిళ స్నేహితుడు చాటింగ్ చేస్తూ *Praise the Lord Jesus Christ* అన్నాడు. నేను *Shalom in the name of Yahshua Messiah* అన్నాను. యషువ మెస్సీయ అంటే ఏమిటి అని అడిగాడు. అది మన రక్షకుని నిజమైన నామం అని చెప్పాను. మేము *Easu* అని అంటాం అన్నాడు. మీరు *Easu* అంటారు, తెలుగు వారు యేసు అని ఇంగ్లీషువారు *Jesus* అని అంటారు అలా పిలవడం ఆయన నామాన్ని అపవిత్రం చేయడమే అని చెప్పాను. దానిదేముంది ఆయా భాషల్లో వారు అలా పిలుచుకుంటారు అని సింపుల్‌గా తీసిపారేశాడు. అప్పుడు నేను అమెరికా అధ్యక్షుని పేరేంటి అని అడిగితే ఒబామా అని అన్నాడు. ఒబామా అని అమెరికన్లు అంటారు. మరి నీవూ అలాగే ఎందుకు పిలుస్తున్నావు? నీవు మాత్రమే కాదు ప్రపంచములో ఆయా జాతులవారు, ఆయా భాషలు మాట్లాడేవారు అందరూ ఒబామా అనే ఎందుకు పిలుస్తున్నారు? అని ప్రశ్నించేసరికి సైలెంట్ అయిపోయాడు. మరలా కొంతసేపటికి ఈ భాషలన్నీ ఇచ్చింది ఆయనే కదా అన్నాడు. అవును ఈ భాషలన్నీ ఇచ్చింది ఆ సర్వశక్తిమంతుడే కాని భాష భాషకు ఆయన పేరు మాత్రం మార్చలేదు అని చెప్పాను. కఠినమైన దాస్యత్వంలో ఉన్న తన ప్రజలైన ఇశ్రాయేలీయులను విమోచించడానికి మోషే పంపినప్పుడు, ఎవరు నిన్ను పంపించారని ప్రజలు నన్ను అడిగతే ఏమని చెప్పాలని మోషే అడిగినప్పుడు ఆయన తన నామం చెప్పి ఇంకా ఇలాగు ఆయన మోషేతో చెప్పాడు. **- మీ పితరుల ఎలోహీం అయిన "యావె" అనగా అబ్రహాము ఎలోహీం, ఇస్సాకు ఎలోహీం, యాకోబు ఎలోహీంనైన "యావె" మీ యొద్దకు నన్ను పంపెనని నీవు ఇశ్రాయేలీయులతో చెప్పవలెను. నిరంతరము నా నామము ఇదే, తరతరములకు ఇది నా జ్ఞాపకార్థనామము** (నిర్గమ 3:15) అదే విధంగా సీనాయి కొండమీద **మేఘములో యావె దిగి అక్కడ అతనితో నిలిచి "యావె" అను నామమును ప్రకటించెను** (నిర్గమ 34:5) **మరియు లేఖనము ఫరోతో ఈలాగు చెప్పెను. నేను నీయందు నా బలము చూపుటకును, నా నామము భూలోకమందంతట ప్రచురమగుటకును అందు నిమిత్తమే నిన్ను నియమించితిని** (రోమా 9:17) **సైన్యములకధిపతియగు "యావె" అని ఆయనకు పేరు** (యెషయా 48:2) అని ప్రవక్తయైన యెషయా ప్రకటించుచున్నాడు. **యావెను నేనే; ఇదే నా నామము** (యెషయా 42:8) అని కుండ బద్దలు కొట్టినట్లు ఆయన చెబుతున్నాడు.

"యావె" అను నామము వహించిన ఆత్మరూపియై ఉన్న సర్వాధికారియైన మన పరలోకపు తండ్రి సమస్త మానవాళిని వారి పాపములనుండి రక్షించడానికి శరీరధారిగా ఈ భువిలో జన్మించాడు. **నేను నేనే యావెను, నేను తప్ప వేరొక రక్షకుడు లేడు** (యెషయా 43:11) అని యెషయా ద్వారా పలికించిన "యావె" తానే స్వయంగా తన ప్రజలను రక్షించడానికి రక్షకుడుగా భూమిమీదకు వచ్చాడు. హెబ్రీ భాషలో **షువ** అంటే రక్షకుడు అని అర్థం. యావెయే షువ (రక్షకుడు)గా వస్తున్నాడు కాబట్టి ఆయన నామం యషువ అయినది. ఈ నామం గాక వేరే నామం ఏదైనా ఆయనకు పెడతారేమోనని ఆయన ముందుగానే గబ్రియేలు అను దూతను పంపి తాను పుట్టబోవు సంగతి తనకు పెట్టవలసిన పేరును మరియు యోసేపులకు తెలియజేసాడు. గబ్రియేలు దూత కూడా యోసేపుతో అవే విషయాలు చెప్పాడు. ఆమె (మరియ) యొక కుమారుని కనును; తన ప్రజలను వారి పాపములనుండి ఆయనే (యావె) రక్షించును గనుక ఆయనకు యషువ అను పేరు పెట్టుదువనెను. ఇదీ అసలు సత్యం. ఈ నామంలోనే మనము రక్షణ పొందవలెను గాని ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి యే నామమున రక్షణ పొందలేము అని పరిశుద్ధాత్మతో నిండినవాడై పేతురు ప్రకటించుచున్నాడు. ఈ సీమోను పేతురు మెస్సీయగారితో మూడున్నర సంవత్సరాలు ఉన్న వ్యక్తి. ఆయన చేసిన అద్భుతకార్యాలన్నిటికి ప్రత్యక్షసాక్షి. యషువ మెస్సీయ ఆరోహణమయ్యేముందు ఆయన యందు విశ్వాసముంచిన విశ్వాసులకు కాపరిగా (అధ్యక్షుడుగా) ఉండుటకు స్వయంగా మెస్సీయగారితో నియమింపబడిన గొప్పవ్యక్తి. లోకానికి భయపడి ముమ్మారు ఆయన ఎవరో యెరుగనని బొంకినప్పటికీ పెంతెకోస్తు (వారముల) పండుగ నాడు పరిశుద్ధాత్మ నిండినవాడై అనేకమంది ప్రజల మధ్య నిలబడి వారందరికి "యషువ మెస్సీయ"నామమును ప్రకటించాడు. ఇంచుమించు మూడువేల మందికి అదే దినమందు "యషువ మెస్సీయ" నామంలో బాప్తీస్మం ఇచ్చాడు. ఆయన మాత్రమే గాక మిగిలిన అపోస్తలులు అందరూ అదే నామంలో బాప్తీస్మం ఇచ్చారు. సంఘమునకు యెరూషలేములో గొప్ప హింస కలిగినప్పుడు ప్రపంచము నలుమూలలకు చెదరిపోయిన అపోస్తలులు ఆయా దేశాలలో "యషువ మెస్సీయ" నామమును ప్రకటించారు. మన దేశానికి వచ్చిన తోమా అదే నామమును ప్రకటించాడు. ఆ నామములోనే ఒక గొప్ప సూచకక్రియ చేసాడు. ఆ నామములోనే కొందరికి బాప్తీస్మమిచ్చాడు. చివరకు ఆయన నిమిత్తమే హతసాక్షి అయ్యాడు. యూదులలో యషువ మెస్సీయ నామమును అంగీకరించినవారిని బాధపెడుతూ, చంపుతూ వచ్చిన సౌలును దమస్కు మార్గములో పడగొట్టి అతనికి తన ఆత్మ ద్వారా సమస్తమును బోధపరచి అన్యులయెదుట, రాజులయెదుట, ఇశ్రాయేలీయుల యెదుట "యషువ మెస్సీయ" అను ఆయన నామము నిమిత్తం ఎన్నో శ్రమలను అనుభవించుటకు అదే సౌలును ఆయన ఏర్పరచుకొన్నాడు. యషువ మెస్సీయ నామంలో వారు రోగాలను నయం చేసారు. దెయ్యాలను వెళ్ళగొట్టారు. ఎన్నో సూచకక్రియలను అద్భుతాలను చేసారు. అన్ని నామములకన్నా పై నామం "యషువ మెస్సీయ" నామం! ఒక మనుష్యునియొక్క నామము భాష భాషకు ఏవిధంగా మారదో అదే విధంగా మన రక్షకుని నామం కూడా భాష భాషకు మారదు. ఈ సంగతి తెలిసికూడా మూర్ఖత్వంలో ఈసు అని, యేసు అని, ఐసస్ అని, జీసస్ అని తమ ఇష్టానుసారముగా పలుకుచూ ఆయన నామమును అపవిత్రపరచుచున్నారు క్రైస్తవజనాంగం. ఎన్నిసార్లు, ఎన్నివిధాలుగా ప్రకటిస్తున్నా వీరి తోలుమందం మనస్తత్వం మారట్లేదు. పైగా ఏ పేరుతో పిలిచినా ఆయన పలుకుతాడు, కొంతమంది దేవుని పేరేంటి? దేవునికి పేరేంటి అని మరికొందరు, మా బైబిల్లో ఇలాగే ఉంది కాబట్టి ఇలాగే పిలుస్తామని ఇంకొందరు పనికిమాలిన వాదనలు చేస్తున్నారు. ఎలాబడితే అలా పలకడానికా పనిగట్టుకొని గబ్రియేలుతో ఆయన నామం చెప్పించాడు? నిర్లక్ష్యం, లెక్కలేనితనం, ఆత్మీయ గ్రుడ్డితనం, అమాయకత్వం, దుర్మార్గం అంతా కలగలిసిపోయింది ఈ క్రైస్తవ్యంలో! ఏది నిజమైన నామమో తెలియనంత బుద్ధిహీనతలో ఉన్నారు ఈ ప్రజలు. ఇటీవల ఒక సోదరుడు *Jesus Christ is lord fo all* అని అన్నాడు. అప్పుడు నేను ఈ *Jesus Christ* ఏమిటి అంటే అది మన రక్షకుని నామం అని చెప్పాడు. అలా అని ఎక్కడ ఉంది అంటే ఇంగ్లిష్ బైబిల్‌లో అన్నాడు. మరి తెలుగులోకాని, తమిళ్, మళయాళ, హిందీ, కన్నడ భాషల్లో గాని, గ్రీకు, హెబ్రీ భాషల్లో గాని *Jesus Christ* అని లేదేంటి అని అడిగితే నీళ్ళు నమిలాడు. ఆయన పేరు *Jesus Christ* అవడానికి ఆయన ఎప్పుడు పుట్టాడు? ఆయన పుట్టినప్పుడు అసలు ఇంగ్లిషు లేనే లేదు కదా! మరి ఆయన పేరు *Jesus Christ* ఎలా అయ్యింది? అసలు భాషే లేనప్పుడు గబ్రియేల్ దూత ఇంగ్లీష్ పేరు పెట్టమని ఎలా చెబుతుంది? అసలు బుర్రుందా నీకు అని అడిగితే సమాధానం చెప్పలేదు. కాబట్టి మూర్ఖత్వాన్ని వదిలిపెట్టి సత్యమును వెంబడించండి. మన రక్షకుని నిజనామం "యషువ మెస్సీయ" అని తెలుసుకోండి. ఆ నామంలో బాప్తీస్మం పొందండి. అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుతారు (అ॥కార్య 2:39) **ప్రతివాని నాలుకయు తండ్రియైన యావె మహిమార్థమై యషువ మెస్సీయ సర్వాధికారియని ఒప్పుకొనునట్లును ఎలోహీం ఆయనను అధికంగా హెచ్చించి ప్రతి నామమునకు పై నామమును ఆయనకు అనుగ్రహించెను** (ఫిలిప్పీ 2:11)

**- బ్రదర్ పి. రాజ**

## ఎడిటర్ నోట్

ప్రియ పాఠకులకు షలోం. పత్రికను ఉచితముగా పొందుచున్నవారు తప్పక సం॥ర చందా రూ. 100/- పంపి పత్రికను పొందవలెను. ఈ పరిచర్య ద్వారా బాప్తీస్మము పొంది సత్యములో నడచుచున్న సహోదరులు తప్పక పత్రిక పరిచర్యకై సహకరించవలెను. ఈ పత్రిక ప్రస్తుత కాలంలో కేవలం ఒక్క కుటుంబం ద్వారా మాత్రమే 3000 కాపీలు ప్రింట్ చేయబడుచున్నది. మన పరిచర్య ద్వారా బాప్తీస్మము పొంది సత్యములో నడుచుచూ దూరముగా ఉన్న సహోదరులు తమ కానుకలను ఆన్‌లైన్ ద్వారా పంపించవచ్చును. మన పరిచర్య కొరకై ప్రార్థించండి. మీ అందరి నిమిత్తము ప్రార్థన చేయుచున్నాము.

| | | |
|---|---|---|
| Isaac E. Kusuma | Isaac E. Kusuma | Isaac E. Kusuma |
| Online AcNo.30961655735 | OnlineAcNo.10025001028 | Online AcNo.62128006892 |
| Bank Code 12696 | Bank Code 0361 | Bank Code 21219 |
| State Bank of India | Andhra Bank | State Bank of Hyderabad |
| MALIKIPURAM-533 253 | MALIKIPURAM-533 253 | MALIKIPURAM-533 253 |
| E.G.Dist | E.G.Dist | E.G.Dist |

Printed, Published and Owned by Isaac E. Kusuma and Printed at Ratna Offset, Malikipuram-533253. E.G.Dt. and Published at Malikipuram Editor Isaac E. Kusuma. All rights reserved